క్లుప్తంగా

నేడు మండల స్థాయి పోటీలు

అమ్రాబాద్: క్రీడా పాఠశాలలకు వెళ్లేందుకు నాలుగు, ఐదో తరగతి విద్యార్థులకు బుధవారం ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బాలకిషన్ తెలిపారు. మండల కేంద్రం పదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు సెలక్షన్‌కు హాజరుకావాలని సూచించారు. మండల స్థాయిలో సెలక్షన్ అయిన వారికి ఈ నెల 19న జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయన్నారు.

7న గోపద్మ వ్రతం

కందనూలు: జిల్లా కేంద్ర సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయంలో గోశాలలో ఈ నెల 7న ఆషాఢ మాసం పంచమి తిథి, శుక్రవారం రోజు ఉదయం 8 గంటల నుంచి సామూహిక గోపద్మ వ్రతం గోశాలలో నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షులు ఆకారపు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ వ్రతంలో పాల్గొనేవారు పూర్తి వివరాలకు 9441303182, 9848320723, 9440194513 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సర్వసభ్య సమావేశం

పెద్దకొత్తపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 7న నిర్వహించనున్నట్లు ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఎంపీడీఓ కృష్ణయ్య తెలియజేశారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

పథకాల అమలుతీరు పరిశీలన

బల్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై మంగళవారం మండలంలోని అంబగిరిలో లబ్ధిదారుల అభిప్రాయాలను ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల బృందం సేకరించారు. మూడు సంవత్సరాలకు సంబంధించిన అభివృద్ధి పనులను జియో ట్యాగ్ రూపంలో ఫొటోలు తీసుకున్నారు. గ్రామస్థాయి అధికారుల విధులు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ సభ్యురాలు తిర్పతమ్మ, డీఎల్‌పీఓ వెంకటయ్య, ఏపీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కల్వకుర్తి రూరల్: వంగూరు మండలం డిండి చింతపల్లిలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆర్డీఓ రాజేష్‌కుమార్‌కు సీపీఎం నాయకులు మంగళవారం వినతి అందజేశారు. వంగూరులోని సర్వే నంబర్ 503, 504, 505లో 11 ఎకరాల భూమి పట్టాలు ఇవ్వడానికి 1997లో భూమి కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చిందని సీపీఎం నాయకులు అన్నారు. ఆంజనేయులు, సి.ఆంజనేయులు, కృష్ణయ్య, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఎంఈఓకు వినతి

వెల్దండ: ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్ వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఇష్టానుసారంగా అధిక ఫీజులను వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శి ఉమేష్, పవన్, చరణ్, చంటి, నందు, కుమార్, నవీన్ తదితరులు ఉన్నారు.

నోట్‌పుస్తకాల అందజేత

ఉప్పునుంతల: మండలంలోని లక్ష్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఏళ్ల సురేందర్‌రెడ్డి, అతని సోదరుడు ఏళ్ల క్రాంతి కుమార్‌రెడ్డి విద్యార్థులకు ఉచితంగా బోధన ఉపకరణాలను అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 70 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర ఉపకరణాలను అందజేశారు. సర్పంచు పుష్పవతి, ఎస్‌ఐ గురుస్వామి, రమేష్, పానుగంటి రమేష్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం

ఊర్కొండ: వివేకానందుడు యువతకు ఆదర్శప్రాయుడని పలువురు కొనియాడారు. మంగళవారం వివేకానందుడి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అలర్పించారు. నేతాజీ, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఊర్కొండ స్టేజీ వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి నివాళి అర్పించారు. నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు అభిషేక్ శ్రీఖ శ్రీఖకాంత్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై శ్రద్ధ కనబర్చాలి

తాడూరు: ఉపాధి పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ గంగామోహన్ ఉపాధి సిబ్బందిని కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, ఆయా గ్రామాలపంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో గ్రామాల వారీగా ఉపాధి పనులపై సమీక్షించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపుల గుంతలు తీయించి పూలమొక్కలను నాటించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఓ ప్రదీప్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య సేవలు మరువలేనివి


గంగారంలో అమరులకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కల్వకుర్తి రూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు కొమురయ్య సేవలు మరువలేనివని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆవరణలో కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ దేవరాజ్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ విముక్తి కోసం కొమరయ్య చేసిన పోరాటం చారిత్రాత్మకమైందన్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా తెలంగాణ విముక్తి సాధ్యమైందన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు పిలుపునిచ్చారు. మంగళవారం దొడ్డి కొమరయ్య 97వ వర్ధంతిని నిర్వహించారు. అశోక్, ఉస్సేన్, పరశురాములు, వెంకటయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య, స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్‌లు అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి వారి త్యాగాలను, చరిత్రను విద్యార్థులకు వివరించారు. రత్నశేఖర్, రాజప్ప, మహమ్మద్ పాల్గొన్నారు.


కొల్లాపూర్‌లో కొమరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వర్షం కోసం వరదపాశం


వరదపాశం ఆరగిస్తున్న చిన్నారులు, వృద్ధులు

అచ్చంపేట రూరల్: వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తమ తల్లిదండ్రులు వర్షం రాక కోసం ఎదురు చూస్తుండటం చూసి చిన్నారులు, యువకులు గ్రామ సమీపంలో ఉన్న పెద్ద బండలపై వరదపాశం పోశారు. తొలకరి వర్షం రావడంతో రైతులు తమ పొలాల్లో విత్తనాలు విత్తారు. మొలకెత్తిన మొలకలు వాడి పోతుండటం చూసి రైతులు లబోదిబోమంటున్నారు. వర్షం రాకకోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కప్పకావడితో ఊరంతా తిరిగారు.

విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ సభ్యుల సన్మానం


విద్యార్థులకు మెడల్స్ బహుకరించిన క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

కోడేరు: మండలంలోని వివిధ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు పెండ్యాల విజయ్ కుమార్ సన్మానించారు. మంగళవారం ఎత్తం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేసి వారిని సన్మానించారు.

తెలకపల్లి: జిల్లా కేంద్రంలో మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని గొరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన లాల్‌కుమార్, చింటూ ప్రథమ స్థానంలో నిలిచి ప్రశంసా పత్రంతో పాటు రూ.10 వేల నగదు బహుమతిని గెలుపొందారు. ఈ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కొల్లాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యాసంవత్సరం పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు సత్కరించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు టాపర్లకు నగదు పురస్కారాలు అందించారు. మొత్తం 12 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్, విజయ్‌కుమార్, రాంచందర్‌రావు, రాంప్రసాద్, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలి


విద్యార్థిని సన్మానిస్తున్న గ్రామపెద్దలు

కల్వకుర్తి రూరల్: బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఐఐఐటీకి ఎన్నికైన విద్యార్థి మల్లేష్‌కు గ్రామ ప్రజలు సూచించారు. మంగళవారం మండలంలోని మార్చాలలో గ్రామ పెద్దలు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడారు. ఉన్నత స్థాయికి ఎదగాలని తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పుల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, వార్డు సభ్యులు ఉన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి


కొల్లాపూర్‌లో అల్లూరి జయంతి వేడుకలు

కొల్లాపూర్: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను మంగళవారం కొల్లాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలోని అల్లూరి విగ్రహానికి అల్లూరి స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు పి.సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచిన గొప్ప పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. సుధాకర్, బాబు, శ్రీరామ్, చక్రి, సురేష్, రాజు తదితరులున్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం..

కల్వకుర్తి రూరల్: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్‌ల నియామకాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కిషన్‌రెడ్డి పార్టీ సిద్ధాంతపరంగా ముందుకు తీసుకెళ్తాడని, ఈటల రాజేందర్ వచ్చే ఎన్నికలను తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని పార్టీని అధికారంలోకి తీసుకొస్తారన్నారు. రాఘవేందర్ గౌడ్, దుర్గా ప్రసాద్, శేఖర్‌రెడ్డి, రవిగౌడ్, వివేకానంద పాల్గొన్నారు.

బిజినేపల్లి: కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని చేసే అబద్దాలను ప్రచారాలను ఆధారాలతో తిప్పికొట్టాలని కర్ణాటక విస్తారకులు శ్రీనివాసులు తెలియజేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శక్తి కేంద్ర, బూత్ అధ్యక్షుల సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ 9 సంవత్సరాల నుంచి 90శాతం అబద్దాలను చెప్పుకొని ప్రచారం చేస్తుందన్నారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి, భూషయ్య, లక్ష్మీనారాయణ, కడారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'హరితహారం' మొక్కలు నాటాలి

చారకొండ: గ్రామాల్లో హరితహారం మొక్కలను గ్రామాల వారీగా ఇచ్చిన లక్ష్యం మేరకు నాటాలని ఎంపీడీఓ జయసుధ సూచించారు. మండలంలోని తిమ్మాయిపల్లిలో మంగళవారం ఖాళీ స్థలంలో మొక్కలు నాటే ప్రదేశాన్ని ఎంపీడీఓ జయసుధ పరిశీలించారు. మొక్కలు నాటే విధానంలో పాటించాల్సిన పద్ధతులను తెలియజేశారు. సారంబండ తండాలో నర్సరీని, కంపోస్టు షెడ్‌ను పరిశీలించారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, లక్ష్మయ్య, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

యాదవ సంఘం ఎన్నిక

ఉప్పునుంతల: మండలంలోని జప్తీ సదగోడులో సోమవారం రాత్రి శ్రీకృష్ణ యాదవ సహకార సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కోట్ల భీమయ్య యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా కొట్టం పెద్ద వెంకటయ్య యాదవ్, ఉపాధ్యక్షులుగా తిర్పతయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కోట్ల శ్రీను యాదవ్ తదితరులు ఎన్నుకున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



అచ్చంపేట రూరల్: కనీస వేతనాలు రూ.25 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 6 నుంచి నిర్వహించనున్న గ్రామపంచాయతీ వర్కర్ల సమ్మెను జయప్రదం చేయాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్ కోరారు. మంగళవారం అచ్చంపేటలో సీఐటీయూ కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె చేపడుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకుడు మల్లేష్, వేమయ్య, సుల్తాన్, గణేష్, నిరంజన్, శ్రీను పాల్గొన్నారు.

బల్మూర్‌లో: మండలంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

రైతుబంధుకు దరఖాస్తులు చేసుకోవాలి

కొల్లాపూర్, పెంట్లవెల్లి: కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారు, పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు ఈ నెల ఏడో తేదీ లోపు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి నాగరాజు సూచించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులు చేసుకుంటే 2023–24 వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతుబంధుకు అర్హులవుతారని తెలిపారు. దరఖాస్తు పత్రాలతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ పత్రులను ఆయా గ్రామాలకు చెందిన ఏఈఓలకు అందించాలని సూచించారు. ఈ సీజన్‌కు సంబంధించి కొల్లాపూర్ మండలంలో ఇప్పటి వరకు 13,695 మంది రైతులకు రూ.10.59 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లికి చెందిన ఉడత అల్లాజీ మృతిచెందడంతో మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి అందజేసిన రూ.5 వేలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ బాధిత కుటుంబానికి అందజేశారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

వంగూరు: వంగూరు మాజీ సర్పంచ్ వేనేపల్లి లక్ష్మమ్మ(70) మంగళవారం మృతిచెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె 2013 నుంచి 2018 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె మృతికి టీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు సంతాపం తెలియజేశారు.

మిషన్ భగీరథ పైపును ఢీకొట్టిన కారు



వెల్దండ: మండల పరిధిలోని తుంకిబండ తండా సమీపంలో అదుపుతప్పి కారు మిషన్ భగీరథ పైపును మంగళవారం ఢీకొట్టింది. దీంతో కారు వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ గేట్‌వాల్‌ను ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని వెల్దండ పోలీసులు తెలియజేశారు.

మహిళపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: విధుల్లో ఉన్న మహిళా హెడ్‌కానిస్టేబుల్‌ను దూషించిన ఓ మహిళపై అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. అచ్చంపేట పట్టణం వలపట్ల కాలనీకి చెందిన పోతుగంటి చిట్టెమ్మ అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుల్ పద్మను అకారణంగా దూషించింది. పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలియజేశారు.

పాఠశాలలోని ఇనుప సీకులు చోరీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వలపట్ల కాలనీ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణ పనుల కోసం దాచి ఉంచిన ఇనుప సీకులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం సుభేరాభేగం ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

కేసు నమోదు

వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లికి చెందిన ఉడత అల్లాజీ సోమవారం మృతి చెందడంతో మంగళవారం భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహానికి కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పద్మశాలి సంఘం సభ్యత్వం నమోదు

చారకొండ: అఖిలభారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని జూపల్లి, చారకొండ గ్రామాల్లో మంగళవారం సభ్యత్వం చేపట్టారు. మండల అధ్యక్షుడు చిల్వేరు సత్యం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో సభ్యత్వం చేపడుతున్నట్లు తెలియజేశారు. పద్మశాలీలు రూ.10 చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకోవాలన్నారు. సంఘం నాయకులు బాల్‌రాజు, శ్రీను, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లక్ష్యాల పూర్తిలో ఆర్‌బీఎస్‌కే ముందంజ


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

బిజినేపల్లి: చిన్నారుల పుట్టుక లోపాలు, పోషణ లోపాలు, వారి ఎదుగుదల లోపాలు వంటి లక్ష్యాలను అధిగమించడంలో ఆర్‌బీఎస్‌కే ముందుందని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. మంగళవారం పాలెం పీహెచ్‌సీలో ఆర్‌బీఎస్‌కే సిబ్బంది వార్షికోత్సవ సమ్మేళనం ఏర్పాటు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎంహెచ్‌టీ బృందాలు స్క్రీనింగ్ ద్వారా గుర్తించి తగు వైద్యం అందించి శస్త్రచికిత్సలు ఆర్‌బీఎస్‌కేల ఆధ్వర్యంలో చేయించారన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి గాను 96.07శాతం స్క్రీనింగ్ సేవలు అందించామన్నారు. అందులో 11 శాతం బాలలకు వివిధ ఆరోగ్య సమస్యలు గుర్తించామన్నారు. వారిలో 95 శాతం మందికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, ఆర్‌బీఎస్‌కే, వైద్య సిబ్బంది రఘు, డా.బీమానాయక్, రవినాయక్, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ర్యాలీ


ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్న పెంట్లవెల్లి బాధితులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సర్వే నంబర్ 22, 27లోని 14 ఎకరాల 36 గుంటల భూమిని పెంట్లవెల్లి పేద ప్రజలకు పంపిణీ చేయాలని సీఐటీయూ ప్రజాపోరాట ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడారు. నాయకులు, అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో హన్మంతు, శ్రీనివాసులు, శివవర్మ, తరుణ్, అరుణ, శేషు, రామకృష్ణ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న ఏపీఎం నిరంజన్

తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐకేపీ ఏపీఎం నిరంజన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మహిళా సంఘాలకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అత్యంత నిరుపేదలైన స్వయం సహాయక సంఘాలకు సాయం చేకూరాలన్నారు. సంఘాలు ప్రతినెల జరుపుకొంటున్న సమావేశంలో సంబంధిత సీసీలు, వీఓఏలు, గ్రామ సంఘం అధ్యక్షురాళ్లు పూర్తిబాధ్యతతో పనిచేయాలన్నారు. భాగ్యలక్ష్మీ, అమృత, శిరీష, రాములు, నిరంజన్, సుగుణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి


నాగర్‌కర్నూల్‌లో నోడల్ అధికారికి వినతి అందజేస్తున్న బీఎస్‌ఎఫ్ నాయకుల

నాగర్‌కర్నూల్ రూరల్: విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ చందు, ఆంజనేయులు, శివకుమార్, ఎండి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


గోకారంలో పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 16 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఓటరు జాబితాలను సిద్ధం చేస్తామన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లి, గోకారం, శేరి అప్పారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని గ్రామాల వారీగా ఆయా గ్రామాల్లో బూత్‌లను పరిశీలించారు. బూత్‌లో కనీస సౌకర్యాలు, పోలింగ్ కేంద్రాల నంబర్లు సరి ఉన్నాయా లేదా అని పరిశీలించారు. వారితో పాటు పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

జానపద కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్‌గా జ్యోతి


నియామక పత్రం అందజేస్తున్న రాముమాదిగ

కొల్లాపూర్: తెలంగాణ జానపద కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్‌గా జొన్నలబొగుడకి చెందిన సింగర్ జ్యోతి నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాముమాదిగ ఈ మేరకు ఆమెకు నియామకపు పత్రం అందజేశారు. మంగళవారం కొల్లాపూర్‌లోని కళాకారులు సమావేశమయ్యారు. అనంతరం ఎన్నిక నిర్వహించారు. జిల్లా కన్వీనర్‌గా నియమితురాలైన జ్యోతి మాట్లాడుతూ.. కళాకారుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కల్మూరి రాములు, గోపి, నాగమణి, రుద్రమదేవి, ఎల్లేష్, నాగరాజు తదితరులున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

వెల్దండ: మండల కేంద్రంలోని బాలుర వసతిగృహంలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వసతిగృహాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. వసతిగృహంలో గదులు శిథిలావస్థలో ఉండటంతో వర్షాకాలంలో నీరు కారుతుందని విద్యార్థులు వివరించారు. మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. భవనం పైకప్పు పెచ్చులూడి రాత్రి వేళల్లో విద్యార్థులపై పడుతుందన్నారు. మండలంలో బాలుర వసతి కేవలం బీసీ హాస్టల్ మాత్రమే ఉందని, మండలానికి దూరంగా ఉన్న గ్రామాల విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వస్తే కనీసం వసతులు లేవన్నారు. విజేందర్‌రెడ్డి, జంగయ్యయాదవ్ ఉన్నారు.